కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 55, పచ్చిమిర్చి 75, బెండ 50, కాకర 60, దొండ 45, దోస 40, ఆలు 45, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 100, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 80, చిక్కుడు 90, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొర కాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280.

ఉచిత దంత పరీక్షలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ పాఠశాలలో గురువారం భారత్ వికాస్ పరిషత్, రాణిరుద్రమ బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొంతపల్లిలో..

జిన్నారం: గుమ్మ డిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో ఓ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులను ఉచితంగా అందించారు.

కొనసాగుతున్న వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ కట్ట మైసమ్మ ఆలయంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. అమ్మవారికి రోజుకొక అలంకారం చేస్తున్నారు. గురువారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

తొలగిన అడ్డంకులు..

శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ కమాన్ వరకు త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం


శ్రీదేవి థియేటర్ వద్ద ఒకవైపు పూర్తి కావొస్తున్న కల్వర్టు పనులు


చందానగర్ శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్‌కు వెళ్లే రహదారి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ రోడ్డు పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ముంబై జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్ మీదుగా అమీన్‌పూర్ కమాన్ వరకు పనులు వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. 1.4 కిలోమీటర్లు సుమారు రూ.4 కోట్లతో 150 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభం కానుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాలాపై బాక్స్ కల్వర్టు బ్రిడ్జిల నిర్మాణం దాదాపుగా పూర్తి కావొచ్చాయి.

- నాలుగు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేశారు.
- రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.
- శ్రీదేవి థియేటర్ వద్ద కల్వర్టు పనులు దాదాపుగా పూర్తయ్యాయి.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల తొలగింపు కోసం రూ.1.68 కోట్లు విద్యుత్ శాఖ అందించింది. త్వరలోనే ఆ పనులను పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.
- రోడ్డుపై కూరగాయల సంత, చిరు వ్యాపారుల దుకాణాల నిర్వహణతో వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.


శ్రీదేవి థియేటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న 150 ఫీట్ల రోడ్డు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులు కొంతమేర పూర్తయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కల్వర్టు పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలో మిగతా పనులు ప్రారంభిస్తాం. త్వరితగతిన పూర్తి చేస్తాం.

- కెవిఎస్ఎన్. రాజు, ఈఈ, సర్కిల్ 21

ట్రాఫిక్‌తో ఇబ్బందులు



150 ఫీట్ల రోడ్డు వేయడానికి 2018 సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. పనులు పూర్తికాకపోవడంతో నిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. నిధులు విడుదలైనా అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

-శివరాం, చందానగర్

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా, మరో వ్యక్తికి రూ. 2 వేలు జరిమానాతో పాటు ఒక రోజు జైలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పెంపుడు జంతువుల శ్మశానవాటిక పనుల పరిశీలన

రాయదుర్గం: గోపన్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పెంపుడు జంతువుల శ్మశానవాటిక పనులను జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గోపన్‌పల్లిలో జీహెచ్ఎంసీ, జంతుప్రేమికుడు నందకిశోర్‌తో కలిసి శ్మశానవాటికను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ పెంపుడు జంతువుల కోసం ప్రత్యేకంగా ఆధునిక సౌకర్యాలతో కూడిన శ్మశానవాటికను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. జంతు ప్రేమికుడు నందకిశోర్‌ను వారు అభినందించారు. నిర్వాహకులు నందకిశోర్ మాట్లాడుతూ కేవలం పెంపుడు జంతువులే కాకుండా వీధి జంతువులకు కూడా ఇక్కడ దహనం సంస్కారాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు ఆహ్వానం

రాయదుర్గం: టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) గచ్చిబౌలి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో పరిధిలో కార్గో ఏజెంట్ల నియామకం ఉందని ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని ప్రతి ఏజెంట్ రూ.10వేలు (నాన్ రిఫండబుల్) చెల్లించాలని తెలిపారు. ఒక్క పార్సిల్ పైన 15 శాతం కమీషన్ ఉంటుందని డిపో అధికారులు తెలిపారు. ప్రతి ఏజెంట్ కంప్యూటర్, ప్రింటర్ కలిగి ఉండాలని తెలిపారు. బుక్ చేసిన ప్రతి పార్సిల్‌ను కార్గో బస్సు తీసుకెళుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డి ఫోన్ నంబర్ 9652267204లో సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో లక్ష మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి ఇంటికి ఒక మొక్కను అందించనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఒక మొక్కనైనా నాటాలని కోరారు. ఖాళీ ప్రదేశాలలో, రోడ్ల పక్కల పెద్ద ఎత్తున మొక్కలను నాటుతున్నామని ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈ మోనిక పాల్గొన్నారు.


తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటుతున్న కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురంలో..

వన మహోత్సవంలో భాగంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం

మియాపూర్ ఏసీపీ నర్సింహారావు

హఫీజ్‌పేట్: నకిలీ ప్రెస్ కార్డులు చూపించి, అలాగే రాజకీయ నాయకులమని బెదిరించి డబ్బు వసూళ్ళకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని మియాపూర్ ఏసీపీ నర్సింహారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా భవన నిర్మాణదారులు, వ్యాపారులను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కొంతమంది నకిలీ పాత్రికేయులను, రాజకీయ నాయకులమని బెదిరిస్తున్న వారిని గుర్తించి వారిపై నివేదికలను సిద్ధం చేశామన్నారు. మియాపూర్, చందానగర్, ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎవరైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని మియాపూర్ ఏసీపీ నర్సింహారావు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: జీహెచ్‌యంసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు మనమిచ్చే ఆస్తి స్వచ్ఛమైన పర్యావరణమే అని అన్నారు. వనమహోత్సవంలో నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యతను అధికారులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, భాస్కర్ రెడ్డి, నాగేష్ గౌడ్, పోశెట్టి గౌడ్, కాజామియా, రాజుగౌడ్, ఉమేష్, రాజ్యలక్ష్మీ, మధులత, అరుణ, పుట్టం దేవి, సౌందర్య, లక్ష్మీ, సరిత, తదితరులు పాల్గొన్నారు.

హుడా కాలనీలో జెడ్సీ పర్యటన


నల్లగండ్ల హుడా కాలనీలో పర్యటిస్తున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీలో స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కాలనీలోని పార్కులో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ పార్కు, క్రీడా ప్రాంగణం, సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు వేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, డీఈ విశాలాక్షి, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు హనుమంతు నాయక్, హుడా కాలనీ నాయకులు జలంధర్‌రెడ్డి, రంజిత్ పూరి, దొరబాబు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి కృషి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానవాటికలను ఆయా కులాలు, మతాలకు అనుగుణంగా సమగ్రంగా అభివృద్ధి చేస్తామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో రూ. 30లక్షలతో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఆమె కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ లంకల పద్మ వీరారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వార్డుల్లో శ్మశాన వాటికలను నందన వనాలుగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణతో పనిచేస్తున్నామన్నారు. అందులో బాగంగా ఇప్పటికే మూడు శ్మశాన వాటికల్లో పనులను మొదలు పెట్టామన్నారు.

'పార్ట్‌నర్‌షిప్‌లో మోసానికి పాల్పడలేదు'

గచ్చిబౌలి: హోలిక్ బార్బిక్యూలో పార్ట్‌నర్‌షిప్‌లో ఎలాంటి మోసానికి పాల్పడలేదని యజమాని శ్రీలక్ష్మిపేర్కొన్నారు. హోలిక్ బార్బిక్యూ వ్యవహారంలో మౌనిక, ఆమె భర్త ధరణి చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. మౌనిక పెట్టిన పెట్టుబడిని ఎల్ఎల్‌పీ నిబంధనల ప్రకారం బ్యాంక్ అకౌంట్‌లో ఉంచామని, సెటిల్‌మెంట్ పేపర్లపై సంతకాలు చేసి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

చెడు అలవాట్లకు బానిసలు కారాదు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీ యువకులకు డ్రగ్స్, గంజాయిపై పోలీసులు అవగాహన కల్పించారు. యువత బయటకు వెళ్లినప్పుడు ఏమి చేస్తున్నారో తల్లిదండ్రులు గుర్తించాలని అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సెక్టార్ ఎస్ఐ మాల్యానాయక్ సూచించారు. గురువారం అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు ఏమి చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి వాటి జోలికి పోకుండా ఉండాలన్నారు.

కమ్యూనిటీ హాల్ కోసం ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణనగర్, న్యూ సైబర్ వ్యాలీ కాలనీలలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ గురువారం అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు నర్సింగరావు, వెంకటేష్ గౌడ్, వెంకట్‌రెడ్డి, వీరభద్ర, సూర్యనారాయణ, అశోక్ పాత్రో, ఫణిరాజు, రాజా చెలమకురి, కృష్ణారావు, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

టెలికామ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



రాయదుర్గం: ఒమెగా ఆస్పత్రి ఆధ్వర్యంలో టెలికామ్‌నగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలనీలోని సాయిదత్త గణపతి దేవస్థానంలో నిర్వహించిన శిబిరంలో బీపీ, ఎస్‌పీఓ 2, బీఎంఐ, ఈసీజీ వంటి సేవలను ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అర్చన, అనురాగ్, వైద్య బృందం పర్యవేక్షణలో 120 మంది స్థానికులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రభాకర్, దినేష్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్.. 11 మందిపై కేసులు నమోదు

మియాపూర్: రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే చర్యలు తీసుకుంటామని మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ అన్నారు. మియాపూర్ మదీనాగూడ దీప్తీ శ్రీనగర్ కాలనీ దగ్గర జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద అడ్డదారిలో వెళ్తున్న 11 మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. దీప్తీ శ్రీనగర్ కాలనీ యూటర్న్ దగ్గర ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. అటువైపు అడ్డదారిలో వస్తున్న 11 మంది ద్విచక్ర వాహనదారులను గుర్తించి వారిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేశామని మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ తెలిపారు.

వర్షాకాలం.. పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి


సమావేశంలో పాల్గొన్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో డెంగ్యూ వ్యాధి నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణ కోసం పారిశుద్ధ్య, ఎంటమాలజీ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను వెంటనే గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్‌తో పాటు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, ప్రైవేట్ ఆస్పత్రులను ఉప కమిషనర్లు, వైద్యాధికారులు, ఏఈలు సందర్శించి జ్వరం కేసులపై ఆరా తీయాలన్నారు. సీజన్ ముగిసే వరకు క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్యం అమలయ్యేలా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీలు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, సురేష్‌నాయక్, వైద్యాధికారులు, డీపీఓలు, ఎంటమాలజీ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

న్యాక్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డు

మాదాపూర్: మాదాపూర్ న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)కు అరుదైన పురస్కారం లభించింది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ అకడమిక్ అండ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ముంబైలో గురువారం నిర్వహించిన వరల్డ్ ఎడ్యుకేషన్ కాంగ్రెస్ గ్లోబల్ అవార్డ్స్‌లో న్యాక్‌కి స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డును అందజేశారు. ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ లీడర్ ప్రొఫెసర్ ఇందిరా పారిఖ్ చేతుల మీదుగా న్యాక్ డైరెక్టర్లు శాంతిశ్రీ, ఎం.రాజిరెడ్డిలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 10దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.


అవార్డును అందుకున్న న్యాక్ డైరెక్టర్లు శాంతిశ్రీ, రాజిరెడ్డి

భెల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కృష్ణంరాజు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) సర్వసభ్య సమావేశాన్ని భెల్ యూనియన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు, ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికైన కృష్ణంరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

- సర్కిల్-22లో యాంటీ లార్వా ఆపరేషన్
- ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో పాఠశాలల్లో అవగాహన సదస్సులు


ఇళ్లలో పరిశీలిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది


విద్యార్థులకు అవగాహన కలిస్తున్న అధికారులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: దోమలు వృద్ధి చెందకుండా జీహెచ్ఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్కిల్-22 పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌లలో వర్షాకాలం నేపథ్యంలో దోమల నిర్మూలన చర్యలను వేగవంతం చేశారు.మూడు డివిజన్‌లలో ఒక్కొక్క డివిజన్‌లో ఆరు టీంలు 250 పైగా ఇళ్లలో రోజు తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టారు. మలేరియాకు సంబంధించి ఎనాఫిల్ ,క్యూలెక్స్, ఏడిస్ దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఏరియాలో ఒక ఫీల్డ్ అసిస్టెంట్, ఒక వర్కర్ స్ప్రే చేస్తుంటారు. సూపర్‌వైజర్ ప్రతి ఇంటికి వెళ్లి ఎనాఫిల్ టెస్ట్ చేస్తుంటారు కొబ్బరిచిప్పలు, టైర్లు, కూలర్లు, పూల మొక్కల ప్లేటులో నిల్వ ఉన్న నీరు వల్ల వ్యాప్తి చెందే దోమల వల్ల చికన్ గున్యా, డెంగీ జ్వరాలు వస్తాయి. వీటికి గాను 'ఏడిస్' టెస్ట్ చేస్తున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా..

నీటి ద్వారా వ్యాప్తి చెందే దోమలను మొదటి దశలోనే అంతం చేసేందుకు 'టీపీ టెమో పాస్‌ను చేస్తారు.కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ సెల్లార్‌లలో నిలిచే నీటి ద్వారా వ్యాప్తి చెందే దోమల కట్టడికి ఎంఎల్ఓ ఆయిల్‌ను చల్లుతారు. ఇలా ప్రతి రోజు బస్తీల్లో, కాలనీల్లో ఈ టెస్టులను నిర్వహిస్తారు. దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు రామచంద్రాపురం పరిధిలో బొంబాయి కాలనీ,ఈఎస్ఐ కాలనీ,భారతినగర్ డివిజన్‌లో ఎస్ఎన్ కాలనీ, జ్యోతినగర్, పటాన్‌చెరు డివిజన్‌లో సాయిరాంనగర్ కాలనీ, జేపీ కాలనీ, అంబేడ్కర్ కాలనీలను గుర్తించి దోమల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నాం

దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.బస్తీ, కాలనీలలో, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం.ఇళ్లల్లో ఫ్లవర్ బొకే ప్లేట్స్‌లో నీరు నిల్వ ఉంటుంది.ఆ నీటి ద్వారా కూడా దోమలు అధికంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

-జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సూపర్‌వైజర్ నాగార్జునరెడ్డి

అమ్మవారికి తొలి బోనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ కుమ్మర మహిళా సంఘం అధ్యక్షురాలు, కౌన్సిలర్ పావని రవీందర్ ఆధ్వర్యంలో గురువారం భెల్ పెద్దమ్మ ఆలయంలో కుమ్మర్ల తొలి బోనం ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

PUBLIC NOTICE

All the general public are hereby informed that my clients **Sumit Panjabi**, S/o.Arun Prakash Panjabi and **Nupur Panjabi**, W/o. Sumit Panjabi, both R/o. Gachibouli, Ranga Reddy District, on 12.05.2024 while traveling from Gachibowli to Raddisson blue hotel in auto, my client lost their bag contain original sale deed document No. **4190 of 2018** pertains to the property bearing Flat No. 1701,17th Floor, Block No. 2, Tower No. II, situated at My home Vihanga, Gopannapally, R.R.District which is laying in the name of my clients, If any person having found the said document any where, they may approach the undersigned and hand over the same document within 10 days from the date of this publication.

Sd/- **M.SRINIVAS REDDY,**
ADVOCATE
Office at Plot No.37 E/P,
Visvesvaraya Engineers Society,
Hastinapuram, B.N.Reddy Nagar,
Ranga Reddy Dist. **Cell: 9848159089**